www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 జులై 2024
5
వైఎస్‌ఆర్



రేపు 'అక్షర సంవేదన' కావ్య ఆవిష్కరణ సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

'అక్షర సంవేదన' కావ్య ఆవిష్కరణ సభ ఈనెల 22న నిర్వహించనున్నట్లు రచయిత, రిటైర్డ్ తెలుగు ఉపన్యాసకులు కైప కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కావ్య ఆవిష్కరణ సభను కడపలోని చెన్నూరు బస్టాండు సమీపంలోని రామకృష్ణ మఠంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సభాధ్యక్షులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.గోపీనాథ్, ఆత్మీయ అతిథిగా ప్రముఖ ఆడిటర్ జి.వి.శివరావు, పుస్తక సమీక్షకులుగా సాహితీ పరిశోధకులు డాక్టర్ పాణ్యం శ్రీనివాస శర్మ, గౌరవ అతిథులుగా రిటైర్డ్ తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ పాలెం వేణుగోపాల్, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి హాజరవుతారని తెలిపారు. సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

గండికోటకు పూర్వ వైభవం వచ్చేనా?



ఎక్కడి పనులు అక్కడే..
సెప్టెంబర్‌లో ఉత్సవాలకు నోచుకునేనా?
ప్రభుత్వం దృష్టి సారించాలి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

ఎంతో ఘన చరిత్రను గండికోట కలిగివుంది. పూర్వ వైభవాలను, అందాలను తనలో ఇముడ్చుకుని పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. 2014 నుంచి 2019 వరకు గండికోట పేరు పర్యటకంగా భారతదేశానికి తెలిసేలా అప్పటి ప్రభుత్వం చర్యలుసుకుంది. 2019 తర్వాత వైసిపి ప్రభుత్వం అందుకు తగ్గట్లు అడుగులు వేయబోయి కరోనా కబంధాల నుంచి బయటికి రాలేక కేవలం సంక్షేమంపై శ్రద్దపెట్టి చివరలో 2023 జూలై 7న ఓబేరాయ్ హోటల్ గండికోటలో నిర్మిస్తున్నామని అందుకు శంకుస్థాపన చేశారు. గండికోటను 2014 నుంచి 2019 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏకంగా నాలుగు సార్లు గండికోటలో వారసత్వ ఉత్సవాలు నిర్వహించి ప్రపంచానికి కోట చరిత్ర తెలిసేలా చర్యలు తీసుకున్నారు. గండికోటలో సుమారు రూ.30 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చుట్టారు. గండికోట 2015 సెప్టెంబర్ 26, 27, 28వ తేదీల్లో మొదటిసారిగా ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. వీటి కోసం సుమారు రూ.కోటి ఖర్చు చేశారు. రెండోసారి 2017 ఫిబ్రవరి 18, 19 తేదీల్లో అప్పటి కలెక్టర్ కేవీ సత్యనారాయణ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఉత్సవాలు నిర్వహించారు. మూడో సారి 2018 జనవరి 21, 22, 23 తేదీల్లో అప్పటి కలెక్టర్ బాబూరావు నాయుడు, సంయుక్త కలెక్టర్ శ్వేతా దగ్గరుండి పనులు పరిశీలించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందుకు సుమారు రూ.రెండు కోట్లకు పైగా ఖర్చు పెట్టారు. 10 వేల మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. నాలుగవ సారి 2019 ఫిబ్రవరి 9, 10వ తేదీల్లో ఘనంగా వారసత్వ ఉత్సవాలను అప్పటి కలెక్టర్ హరికిరణ్ నిర్వహించి కోట విశిష్టతను చాటి చెప్పారు. సుమారు రూ.మూడు కోట్లకుపైగా ఖర్చు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులను రప్పించి ప్రదర్శనలు జరిపారు. కళాజాతలు నిర్వ హించి ఈ పండుగ వాతావరణం తీసుకు వచ్చారు. తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి 2020లో వారసత్వ ఉత్సవాలు కలెక్టర్ హరికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తరువాత కరోనా సమయంలోనూ, కరోనా తర్వాత ఉత్సవాలు జరపకుండా గండికోట వైభ వానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇక నైనా వచ్చే సెప్టెంబర్ నెలలో పర్యాటక దినో త్సవం సందర్భంగా ఉత్సవాలు జరిపేలా స్థానిక ఎమ్మెల్యే, ఆర్‌డిఒ, కొత్తగా వచ్చిన కలెక్టర్ శివ శంకర్‌కు తెలిపి ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



గండికోటలో ఎక్కడి పనులు అక్కడే...

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గండికోట లోయను చూసి అమెరికాలోని గ్రాండ్ కెన్యాన్ తర్వాత అంతే అందంగా ఉందని ఇండియన్ గ్రాండ్ కెన్యాన్‌గా గండికోట వద్ద గల పెన్నా లోయ సమీపంలో సుమారు రూ.7 కోట్లతో రోప్ వే పనులకు శంకుస్థాపన చేశారు. మధ్యలోనే ఆగి పోయింది. దానిని పూర్తి చేయాలి. గండికోటలో రాపెల్లింగ్, జుమ్మారింగ్, కాయకింగ్, బోటింగ్, పారా మోటో రింగ్ తదితర సాహసకృత్యాల క్రీడలు కూడా అందుబాటులో ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యారు. గండికోట ప్రపంచ పర్యాటక కేంద్రాలలో ఒకటి కావడం వలన ఇక్కడికి శుక్రవారం రాత్రి నుంచి శని, ఆదివారాలలో వేల సంఖ్యలో రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి వచ్చే సందర్శకుల తాకిడి అధికంగా వుంటుంది. ఎంతో ఉత్సాహంతో వచ్చిన పర్యాటకులకు గండికోట లోపల ఉన్న రహదారిని, ఇతర మౌలిక వసతుల కల్పన లోపం చూసి పెదవి విరుస్తున్నారు. కొత్త ప్రభుత్వం వాటిపై శ్రద్ద చూపాలని పర్యాటకులు కోరుతున్నారు. పర్యాటకులు కోటలోపల చూసేందుకు చార్మినార్, జైలు (కారాగారం), మాధవరాయస్వామి దేవాలయం, కత్తుల కోనేరు, జుమ్మా మసీదు, ధాన్యాగారం, రంగనాథస్వామి దేవాలయం, రాణి మహల్ వంటి అనేక చూడదగ్గ ప్రదేశాలతో పాటు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అమెరికా గ్రాండ్ కాన్యన్ లాంటి పెన్నాలోయకు వెళ్లేందుకు సరైన రోడ్డు సదుపాయాలు లేవు.

గత వైసిపి ప్రభుత్వం జూలై 7, 8, 9వ తేదీలలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూ.250 కోట్ల పెట్టుబడులతో 50 ఎకరాలలో 120 విల్లాలను ఏర్పాటు చేసేందుకు 99 సంవత్సరాలు పాటు భూమిని లీజుకు ఇచ్చారు. నాటి నుంచి నేటి పనులు ముందుకు సాగలేదు. ఎన్నికల కంటే ముందు కోట ప్రవేశానికి కుడి వైపున సుమారు 5 ఎకరాలలో రూ.2.8 కోట్లతో హార్స్ రైడింగ్ పనులు ప్రారంభించి, ప్రస్తుతం ఆపారు. వాటిని పునరుద్ధరణ చేసి త్వరగా పూర్తి చేయాలి. స్వదేశీ దర్శన్ కింద రోప్ వే పనులు కేంద్ర ప్రభుత్వం చేస్తామని అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆ పనులు చేపట్టిందని చెబుతున్నా ముందుకు సాగడం లేదు. కోట లోపల జుమ్మా మసీదు, చార్మినార్, మాదవరాయస్వామి దేవాలయం వద్ద గ్రీనరి, లైటింగ్ పనులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం నిలబడి పోయాయి. కోట లోపల బయట 80 అడుగుల వెడల్పు తో రోడ్డు వేసేందుకు సర్వే చేశారు. పనులు జరగలేదు. జమ్మలమడుగు నుంచి గండికోటకు ప్రస్తుతం రెండు లైన్ల రోడ్డు ఉంది. 4 లైన్ రోడ్డు వేస్తే ప్రమాదాలు అరికట్టడమే కాక ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

స్థానికులకు అవకాశం కల్పించాలి

టూరిజం అభివృద్ధిలో బయటివారికి అవకాశం ఇవ్వకుండా స్థానికులకు 80 శాతం మేర అవకాశం ఇవ్వాలి. గండికోట గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం కమిటీ ఏర్పాటు చేసి స్థానికుల అభివృద్ధికి కృషిచేయాలి.

- కామాటి గురుఈశ్వర్, సర్పంచ్, గండికోట.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

గండికోటలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. పర్యాటకులు తాగడానికి స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేవు. కనీసం గ్రామస్తులకు కూడా తాగునీరుతో ఇబ్బంది పడుతున్నారు. గండికోట గ్రామంలో ఉన్న వారు టాయిలెట్స్ నిర్మాణం కోసం ఆర్కియాలజీ వారు పర్మిషన్ ఇవ్వడం లేదు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తే సమస్య పరిస్కారం అవుతుంది.

- వీరణాల శివకుమార్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి.

ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

సెప్టెంబర్ నెలలో పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గండికోట పర్యటకంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలి.

- దాసరి విజయ్, సిఐటియు పట్టణ కార్యదర్శి.

భూ సేకరణ పెండింగ్ పనులను
త్వరితగతిన పూర్తి చేయాలి
- కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

జాతీయ రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా జిల్లాలో చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వ లక్ష్యం మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి భూ సేకరణపై శనివారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ హాలులో జెసి గణేష్ కుమార్, డిఎఫ్‌ఒ సందీప్ రెడ్డిలతో కలిసి సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా రహదారులను విస్తృత పరిచి రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అందులో భాగంగా జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులు, రైల్వేలైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఫారెస్ట్, పర్యావరణ, కోర్టు సంబంధిత అంశాలు, అభ్యంతరాలుంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, భూగర్భ, రెవెన్యూ శాల అధికారులను సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన గడువు లోపు భూసేకరణ పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలోని. ఆయా ఆర్‌డిఒలు భూసేకరణ పెండింగ్ పనులను పునః పరిశీలించి వచ్చే సమావేశంలో సాధ్యాసాధ్యాల నివేదికలను సమర్పించాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి జిల్లా పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముందుగా జెసి గణేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనులు, భూసేకరణ పనుల పెండింగ్, ఇప్పటికే రిలీజ్ చేసిన అవార్డు వివరాలను కలెక్టర్‌కు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒ వెంకటపతి, శ్రీనివాసులు, చంద్రమోహన్, ఎస్‌డిసి కౌసర్ భాను, ఎన్ హెచ్ ఎఐ పీడి వేణుగోపాల్, జీఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్ట్స్ సీఈ మల్లికార్జున రెడ్డి, ఎస్‌ఇ వెంకట రామయ్య, ఆర్ అండ్ బి ఎస్‌ఇ ప్రభాకర్ రెడ్డి, డిఇ మాధవి, ఆర్‌అండ్‌బి నేషనల్ హైవే ఇఇ విజయ్ భాస్కర్‌రెడ్డి, డిఇ శ్రీధర్ రెడ్డి, ఆర్‌అండ్‌బి, రైల్వే, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, భూసేకరణ, సర్వే ల్యాండ్స్ విభాగం సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

నేడు బీడీ కార్మికుల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

బీడీ కార్మికుల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. కార్మిక భవన్‌లో ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం ఈనెల 21న నిర్వహించనున్నారు. శనివారం కడప నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ముఖ్యుల సమావేశం షేక్. రేష్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యలను చర్చించడం కోసం బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం కర్నూల్‌లోని కార్మిక కర్షక భవన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీడీ కార్మికులకు అనేక సమస్యలు ఉన్నాయని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఇలాంటి అనేక సమస్యలను చర్చించి భవిష్యత్తులో వీటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు శశికళ, వెంకటసుబ్బమ్మ, ఫరీదా బేగం, రేష్మ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి కడప అర్బన్

రక్తం కృత్రిమంగా తయారవ్వదని , ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్ అన్నారు. శనివారం కడప జిల్లాలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, నెహ్రూ యువ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు జెబివిఎస్ ది ప్రిసర్వర్ సేవ సమితి రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఆర్‌ఒ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ కచ్చితంగా 18 ఏళ్ల నిండిన యువత ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల మనకు వచ్చే ఆరోగ్య లాభాలని గురించి అవగాహన ఉండాలని తెలిపారు. నెహ్రూ యువకేంద్రాధికారి మణికంఠ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విషపూరిత జ్వరాలు వల్ల ఏర్పడిన రక్తం కొరతను తీర్చడానికి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులు, నెహ్రూ యువ కేంద్ర, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న డిఆర్‌ఒ

కడప డయాసిస్ కోశాధికారికి సత్కారం

ప్రజాశక్తి - కడప

కడప డయాసిస్ కోశాధికారిగా, కరస్పాండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఫాదర్ సంబటూరు సురేష్‌ను శనివారం స్థానిక బిషప్ హౌస్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు విజయ్ సుశీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి బొకేను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ డయాసిస్, పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్నారు. అనంతరం ఫాదర్ సురేష్ మాట్లాడుతూ పేద విద్యార్థిని విద్యార్థులకు రాబోయే కాలంలో ఉచిత విద్యను, అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, మానవ హక్కుల విభాగం జిల్లా అధ్యక్షులు పాలగిరిశివ పాల్గొన్నారు.



కోశాధికారిని సన్మానిస్తున్న సుశీల్‌కుమార్

మౌలిక వసతుల కల్పనకు చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. శనివారం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ 1వవార్డు నగర పాలక ప్రాథమిక పాఠశాల వద్ద అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎమ్మెల్యే అవగాహన లేని తనం వల్ల ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముందుకు సాగుతున్నామన్నారు కార్యక్రమంలో కాంట్రాక్టర్ శ్రీనివాసరాజు, ఇఇ ధనలక్ష్మి, డిఇ వేణుగోపాల్, బీసీ నాయకులు గోవింద్, సుబ్బయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. **బిసి భవన్‌ను పరిశీలన..** నగరంలోని పాత రిమ్స్‌లో ఉన్న నూతన బిసి భవనాన్ని కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. శనివారం బిసి నాయకులతో కలిసి భవనానికి కావాల్సిన ఫర్నిచర్, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి భవన్ లో ఏర్పాటు చేసే డిజిటల్ గ్రంథాలయం, గ్రంథాలయ నిర్వహణకు తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తామని చెప్పారు. మిగిలిన సౌకర్యాల కోసం దాతలను సంప్రదిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా బిసి భవన్ నిర్వహణ ఉండాలని పేర్కొన్నారు. కమిటీ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో బిసి సంఘం జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, గౌరవ అధ్యక్షులు ఏ వి ఆర్ విద్యాసంస్థల అధినేత, ఇ.ఆర్. వెంకటేశ్వర్లు, నాయకులు పల్లా నరసింహారావు, పట్టు పోగుల సుబ్బారావు, ఎర్ర బోయిన సుబ్బరాయుడు, యూత్ అధ్యక్షులు సిఆర్‌ఐ సునీల్ జయంత్, మహిళలు, కాంట్రాక్టర్ ఏ.వి. మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ -19 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. శనివారం వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టుపై 5 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 280 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఈశ్వర్ రిత్విక్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 101 పరుగులు (సెంచరీ)చేశాడు. జిహెచ్. వర్మ 81 పరుగులు చేశాడు. అనంతరం 281 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు 46.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. **కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో..** కడప జట్టుపై ఆరు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 43.0 ఓవర్లలో 159 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని గురు చరణ్ 43 పరుగులు చేశాడు. అనంతరం 160 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 32.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. **కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో** కృష్ణ జట్టుపై 4 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెవిన్ శ్రీ నిచ్చయ్ 76, ఎస్. కె. కాజా మొహిద్దిన్ పరుగులు చేశారు. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 30.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కడప

మంచి అలవాట్లతో యువత, విద్యార్థులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి షేక్ ఇమ్రాన్ అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ స్టెప్ ఆధ్వర్యంలో శనివారం కమలాపురంలోని ఎంజెపిబిసి రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్' పై అవగాహనసదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశీయ సంస్కృతిలో ప్రజలు ఆచరిస్తున్నవి,, ఆచరించాల్సినవి పెద్దలు చెబుతారని చెప్పారు. డిగ్రీ పూర్తి అయిన తరువాత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో దాదాపు 370 మంది విద్యార్థులతో పాటు కళాశాలల ప్రధానోపాధ్యాయులు ఎం. నగి రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరులు, అధ్యాపకులు, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, జూనియర్ అసిస్టెంట్ వి.వి. నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్‌కెజి నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి విద్యార్థి వివరాలు పాఠశాలల్లో, కళాశాలలో ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలని కడప మండల విద్యాశాఖ అధికారులు గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మదులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు, ఇతర యాజమాన్యాలల్లో చదువుతున్న విద్యార్థులు వివరాలను తప్పనిసరిగా యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. తమ పిల్లలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు అయ్యారా, లేరా అని తల్లిదండ్రులు చదువుతున్న పాఠశాల యాజమాన్యం అడిగి తప్పనిసరిగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు కానట్లయితే విద్యార్థులకు అందాల్సిన స్టడీ సర్టిఫికెట్, ట్రాన్ఫర్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వం నుంచి అందించే ఏ పథకాలకు అర్హులు కారని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి పాఠశాల యాజమాన్యాలను సంప్రదించాలని తెలిపారు.

మానవుని మనుగడకు ప్రాణం పోసేది మొక్కలే

ప్రజాశక్తి- వల్లూరు

మానవుని మనుగడకు ప్రాణం పోసేది మొక్కలే అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వల్లూరు ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల గ్రౌండ్ పరిసరాలలోఉసిరి, నేరేడు, వేప, చింత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి మానవాళి మనుగడకు ఆధారమైన మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ఎఫ్‌పిసి డైరెక్టర్ డి.శ్రీనివాసులు రెడ్డి సిఇఒ గంగాదేవి, కడప జోన్ విద్యా వాహిని కో-ఆర్డినేటర్ వెంకట సుదర్శన్, శ్యాంసుందర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - కడప : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించా లని, డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం చట్టరీత్యా నేరం అవుతుందని నాల్గవ అదనపు జిల్లా జడ్జి, ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. వీరబాబు అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా వారు స్పాన్సర్ చేసిన హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్ లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ కె. కాంతారావు, బ్రాంచ్ మేనేజర్ ఎస్. అజీజ్ చేతుల మీదుగా వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆఫీసర్ గురు ప్రశాంత్, సిబ్బంది, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు. అనంతరం హెల్మెట్ ధరించి ప్రాణాలు రక్షించుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం

కడప అర్బన్ : బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలోని ఏడు రోడ్లు, హాస్పిటల్ రోడ్, ఆర్‌ఎస్ రోడ్డులోని బ్యాంకు శాఖలలో శనివారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు వ్యవస్థాపకులు, మహారాజా ఆఫ్ బరోడా చైర్మన్ సర్ షయాజీ రావ్ గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు రామాంజుల రెడ్డి, మోహన్ రెడ్డి, మురళి, లక్ష్మణ్, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - వల్లూరు :మండల పరిధిలోని కెబిజె నగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఖాజీపేట జూనియర్ ఆర్థిక శాస్త్రం లెక్చరర్ భాను పార్వతి సహకారంతో విద్యార్థులకు నోట్ బుక్స్ ,పెన్స్ , పెన్సిల్స్, పలకలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సి.వి సురేంద్ర మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. లెక్చరర్ భాను పార్వతి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో రోజూ పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పిన అంశాలన్నీ శ్రద్ధగా విని ఉన్నత విద్యను అవలంభించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి క్షేత్రంలో విద్యుత్ ఎఇ తనిఖీలు

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని కాశినాయన జ్యోతి క్షేత్రం పై శనివారం విద్యుత్ ఎఇ రమేష్ బాబురావు తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. జ్యోతి క్షేత్రంలో విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందని, అక్రమ కనెక్షన్లు తొలగించేందుకు వచ్చామని ఎఇ పేర్కొన్నారు. అక్కడి చేరుకున్న ఆలయ కమిటీ, స్థానికులు విద్యుత్ తొలగించొద్దని తాము ఉన్నతాధికారుల నుంచి అనుమతి తెచ్చుకుంటామని చెప్పారు. అన్ని అనుమతులు త్వరగా తెచ్చుకోవాలని, లేకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని విద్యుత్ ఎఇ హెచ్చరించారు. కార్యక్రమంలో ఈ ప్రాంత గార్డు మల్లికార్జునుడు, విద్యుత్‌శాఖ సిబ్బంది, ఆలయ కమిటీ వారు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీతో మాట్లాడుతున్న విద్యుత్ ఎఇ

సవాళ్లే! ప్రజాదృష్టి

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుల విధులు కత్తిమీద సామును తలపించనుంది. ఇటీవలే వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలుగా హర్షవర్ధన్‌రాజు, విద్యాసాగర్ నాయుడు నియమితులయ్యారు. వైఎస్‌ఆర్ జిల్లా ఎస్‌పివిధులను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంది. జిల్లాలో ఒక వైపు హత్యలు, భూ కబ్జాలు, మరోవైపు ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా వంటి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల భాగస్వామ్యం ఎంతైనా ఉండక పోదు. ఇటువంటి పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఎవరి వైపు మొగ్గు చూపినా ప్రతిఫలాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో విధి నిర్వహణలో అడుగడుగునా ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలి. ప్రతిపక్ష వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ సొంత జిల్లా వాసి కావడంతో పోలీస్ సూపరింటెండెంట్ పనితీరుపై అందరి దృష్టి నిలిచే అవకాశం ఉంది. కూటమి నాయకులు అధికారంలో ఉన్న నేపథ్యంలో జిల్లాలో చోటుచేసుకునే చిన్నపాటి ఘటన సైతం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సదరు ఘటన రాజకీయంగా చిటపటలను ఎదుర్కోవాల్సి వస్తుందని గమనించాలి. గతంలో జిల్లాలో చోటుచేసుకున్న హత్యలు, కబ్జాలు, పోలీసులపైనే కేసులు బనాయించిన ఘటనల వ్యవహారాలు ఉత్కంఠను కలిగించే అవకాశం ఉంది. గతంలో చోటుచేసుకున్న ఓహత్యపై సిఐడి విచారణ చేపట్టింది. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రతీకార రాజకీయాల నేపథ్యంలో పోలీసు విధులు కత్తి మీద సామును తలపించే అవకాశం కనిపిస్తోంది. అన్నమయ్య జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విద్యాసాగర్ నాయుడు సమర్థతను నిరూపించుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో మదనపల్లి సమీపంలోని అంగళ్ల దగ్గర చోటు చేసుకున్న ఘటన తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో చెలరేగిన అల్లర్లు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా టిడిపి కేడర్ సృష్టించిన అల్లర్ల నేపథ్యం తరహా ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉంది. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్రపంచంలోనే అరుదైన, ఖరీదైన ఎర్రచందనం లభిస్తోంది. ఇక్కడి నుంచి దశాబ్దానికిపైగా ఎర్రచందనం అక్రమ రవాణా యధేచ్ఛగా సాగిపోతోంది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడానికి జిల్లా అధికార యంత్రాంగాలు సాహసించిన పాపాన పోలేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఎర్రచందనం, మట్టి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం కత్తి మీద సాము తలపించే అవకాశాలు పుష్కలం. ఎస్‌పిలు బాధ్యతలు నిర్వహించడం కఠిన సవాళ్లను స్వీకరించడమే అవుతుందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు

మహిళలపై అత్యాచారాలు దారుణం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేశంలో నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలు, విద్యార్థినులపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వాటిని ప్రభుత్వాలు అరికట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరబాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక బాలికల జూనియర్ కాలేజీలో శనివారం విద్యార్థినులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో వయస్సుతో సంబంధంలేకుండ బాలికలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో చిన్నారి వాసంతి అత్యాచారానికి గురైందని సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి, యువజన సంఘాలుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాల, కళాశాలలో మహిళల్లో ఆత్మస్థైర్యం నింపేలా మోటివేషన్ క్లాసులు, ఆత్మ రక్షణ కోసం కరాటే, తైక్వాండో వంటి శిక్షణ ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు మియా, డివైఎఫ్‌ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

స్టాక్ వివరాలు తప్పక ప్రదర్శించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దుకాణం ముందు స్టాక్ వివరాలు తప్పక ప్రదర్శించాలని వ్యవసాయ శాఖ పులివెందుల డివిజన్ ఎడి నరసింహారెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన ఎరువుల అంగడి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ కచ్చితంగా స్టాక్ రిజిస్టర్‌ను రాయాలన్నారు. రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. పత్రాలు లేకుండా కొనుగోలు, అమ్మకాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, నాగలక్ష్మి, పట్టణంలోని ఎరువు, పురుగుమందుల వ్యాపారులు పాల్గొన్నారు.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమలో హైకోర్టును, హైకోర్టు బెంచిని ఏర్పాటు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వేంపల్లెలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టు రెండింటిలో ఒక దానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఒప్పందాన్ని అనుసరించి 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు రాయలసీమలో రాజధానిని, కోస్తాలో హైకోర్టును ఏర్పాటు చేశారన్నారు. 1956లో తెలంగాణతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు రాజధాని, హైకోర్టు రెండూ హైదరాబాద్‌కు పోయాయని తెలిపారు. 2014లో రాష్ట్ర విభజన కారణంగా నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పాటైందన్నారు. ఈ నేపథ్యంలో నవ్యాంధ్రప్రదేశ్‌లో రాజధాని, హైకోర్టు ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాలని కోరారు. కాని అలా జరగలేదన్నారు. ఇది ఒక చారిత్రక తప్పిదమని ఆయన తెలిపారు. రాయలసీమ వాసులైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా, జగన్ ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడే ఈ చారిత్రక తప్పిదం జరిగిందని తెలిపారు. రాజధాని, హైకోర్టు రెండూ ఒకే చోట ఉంటే పాలనా సౌలభ్యంగా ఉంటుందని కొందరు వాదించడంలో శాస్త్రీయత లేదన్నారు.

ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలను ఇంటర్ విద్యార్థులకు శనివారం జడ్పీ ప్లస్ బాలికల పాఠశాలలో పంపిణీ చేశారు. ఇంటర్ విభాగం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చెరుకూరి శ్రీనివాసులు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా విద్యార్థులు కళాశాలకు రావాలన్నారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గురునాథరెడ్డి, వెంకట్, రమేష్, సురేష్, పద్మావతి, రెడ్డి సాయి, రాధా పాల్గొన్నారు.

డయేరియా నివారణకు శుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

డయేరియా వ్యాధి సోకకుండా ఉండేందుకు శుభ్రత ముఖ్యమని ప్రభుత్వ వైద్యురాలు స్వాతిసాయి తెలిపారు. మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీపంలో ఉన్న రాజీవ్ నగర్ కాలనీలో మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తాగునీటిని వేడి చేసుకొని చల్లారిన తర్వాత తాగాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. దోమతెరలను వాడాలని సూచించారు. అనంతరం జ్వరాలు, దగ్గు, జలుబు ఉన్న వృద్ధులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉల్లా బేగం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, బాసయ్య, రెడ్డమ్మ, ఎఎన్ఎం అంజనా, పీర నాగమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. 0

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): శనివారం ప్రొద్దుటూరు మండల కామనూరు ఎ హెచ్‌సి పరిధిలోని అమ్మనాన్న, విజయేశ్వరి, శ్రీ వీరబ్రహ్మేంద్ర, కొప్పురం వృద్ధాశ్రమాల్లో వైద్యులు హనీఫ్ బాబా, శ్రీనివాస్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ పివి వరప్రసాద్, చంద్రశేఖర్, ఆశ్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా పివి.రమణ

ప్రజాశక్తి - వేంపల్లె



స్థానిక వృషభాచలేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్‌గా బిసి వర్గానికి చెందిన పాలేగాని వెంకట రమణను టిడిపి అధిష్టానం నియమిస్తున్నట్లు తెలిసింది. స్థానిక చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన పివి రమణ కొన్నేళ్లుగా టిడిపిలో కొనసాగుతున్నారు. త్వరలో దేవ స్థానం పాలక మండలి కమిటీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు సమాచారం. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు టిడిపి గుర్తింపు ఇస్తుందని దానికి నిదర్శనమే పివి రమణ తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో పోలీసులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం


రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న పోలీసులు

ఎస్ఐ విద్యాసాగర్ సేవా దృక్పథంలో భాగంగా శని వారం లింగాలదిన్నెపల్లె వద్ద రోడ్డుపై ఉన్న పెద్ద గుంతలను పూడ్చారు. గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతారని ఎస్ఐ తమ సిబ్బందితో ఆ గుంతలను పూడ్చారు. పోలీసుల సేవా కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది సూర్యనారాయణరెడ్డి, శివ, రమణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

వనంలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు రహదారి సమీపంలో ఉన్న వనంలో శనివారం శరాబు రామచంద్ర ఆచారి (49) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మైదుకూరు మండలం వేపరాల గ్రామానికి చెందిన రామచంద్ర ఆచారి చెక్కల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం తిరుపతికి వెళ్తున్నానని వారం క్రితం ఇంటి నుంచి వచ్చాడు. శుక్రవారం అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ఎస్ఐ తెలిపారు. రామచంద్ర ఆచారి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు.

వేతనాలు అందక.. కుటుంబం గడవక

ఎనిమిది వారాలుగా పెండింగ్‌లో 'ఉపాధి' బిల్లులు - కార్యాలయాల చుట్టూ కూలీల ప్రదక్షిణలు


మండలంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంలో కూలీలకు ఎనిమిది వారాలుగా కూలి అందక ఇబ్బందులుపడుతున్నారు. మండల వ్యాప్తంగా 6,285 జాబ్ కార్డులుండగా.. ఇందులో4,682 మంది కూలీలు పనులకు వెళుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు రూ.92 లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి డబ్బుల కోసం కూలీలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు లేకపోవడంతో వారు ఎక్కువ భాగం ఉపాధి పనులకు వెళ్లారు. ఉపాధి హామీలో కూలీలు పనిచేసిన ఇరవై ఒక్క రోజుల్లోనే వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ నేటికీ మంజూరు కాలేదు. దీంతో తమ కుటుంబం పోషణ భారంగా మారిందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

గత ఎనిమిది వారాలుగా కూలి పనులు చేస్తున్నాం. నేటికీ వేతనాలు రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తమకు డబ్బు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- రవణమ్మ, ఉపాధి కూలీ, సింహాద్రిపురం

త్వరలోనే విడుదల అయ్యే అవకాశం..

ఉపాధి కూలీలకు గత 8 వారాల నుంచి వేతనాలు మంజూరు కానీ విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే చెల్లింపులు జరిగే అవకాశం ఉంది.

- జయభారతి, ఎపిఒ, సింహాద్రిపురం

మహిళలు పోష్ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మహిళలు పోష్ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిక అధికారి డి.శ్రీలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక ఆడియో కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలకు భద్రత ఉండడం అనేది చాలా ముఖ్యమన్నారు. చాలా మంది మహిళలు భయంతో కొన్ని విషయాల్లో వెనకడుగు వేస్తారని తెలిపారు. కానీ వారికి ఆయుధంలా పనిచేసే కొన్ని చట్టాలు ఉన్నాయన్నారు. అందులో ఒకటి పోష్ అని పేర్కొన్నారు. అంటే పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నుంచి మహిళల రక్షణ కల్పించేలా ఈ చట్టం ఉందన్నారు. ఈ చట్టం గురించి మహిళలు కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. కార్యాలయంలో లేదా పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులు అనేది చిన్న విషయం కాదన్నారు. దీన్ని ఈజీగా తీసుకోకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి. ఎస్ఐ సునీల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాధికారిక అధికారి శ్రీలక్ష్మి

ఘనంగా గండి క్షేత్ర శ్రావణమాస ఉత్సవాలు

అన్ని శాఖల అధికారులు సహకరించాలి : దేవస్థాన సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలో ఆగస్టులో జరిగే శ్రావణమాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని దేవస్థాన సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వేంపల్లి టిడిపి మండల పరిశీలికులు రఘునాథరెడ్డి, వేంపల్లి మండల కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ శ్రావణమాస ఉత్సవాల్లో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది సహకరించాలన్నారు. శ్రావణమాసం ఉత్సవాల్లో జిల్లా వాసులే కాకుండా అనంతపురం, కర్నూలు, చిత్తూరు తదితర జిల్లాలల నుండి గండి క్షేత్రానికి భక్తులు వస్తారని తెలిపారు. అన్నదానం ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ సాలన్న, ఎఇ శ్రీహరి, పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్‌ఎంఎస్ రెడ్డి, ట్రాన్స్ కో ఎడి గురుమోహన్, ఎఇ ప్రవీణ్‌కుమార్ యాదవ్, ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు, చక్రాయపేట పిహెచ్‌సి వైద్యాధికారిణి వాణి, ఎంపీడీవో సోమశేఖర్, చక్రాయపేట ఏపీజీబీ మేనేజర్ భానుచంద్ర, గండి దేవస్థాన మాజీ చైర్మన్లు రాజారావు, రాఘవేంద్ర ప్రసాద్, భాస్కర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో నాలుగు రోజులుగా డయేరియా కేసులు నమోదు కావడంతో గ్రామంలో పంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని డ్రెయినేజీ కాలువల్లో వ్యర్థ పదార్థాలను తొలగించారు. గ్రామం నుంచి వెళుతున్న పంట కాలువల్లో కూడా పూడికతీత పనులు చేపట్టారు. మురుగు గుంతల్లో వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మంచినీటి పథకం, ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. దేవళాలు వద్ద ఉన్న మంచినీటి పథకాన్ని శుభ్రం చేయించారు. అంగన్వాడీ కేంద్రం వద్ద నెలకొని ఉన్న అపరిశుభ్రతను తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ జిఎం కిషోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

నీటి పరీక్షలో బ్యాక్టీరియా లేదని నిర్ధారణ..

అల్లాడుపల్లె పంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా చేసే తాగు నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా నిర్ధారణ కాలేదని ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి తెలిపారు. గ్రామంలో డయేరియా కేసులతో గత నాలుగు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలోని 4 ప్రదేశాల్లో నీటిని సేకరించి మైదుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ నిర్ధారణ కేంద్రంలో పరీక్షలు చేయించారు. ఈ నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని వారు నివేదిక ఇచ్చారని ఆమె తెలిపారు. డయేరియా తాగునీటి సమస్య వల్ల ఏర్పడలేదని, ఇతర కారణం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.


పంట కాలువలో పూడిక తీయిస్తున్న అధికారులు

ఉచిత టెట్, డిఎస్‌సి తెలుగు క్లాసులు : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఉచితంగా టెట్, డిఎస్‌సి కోచింగ్‌ను తెలుగు వారి కోసం ఏర్పాటు చేస్తున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు రాజేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం జెవివి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సబ్జెక్ట్‌ను విద్యా నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 97054 32038కు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 22 నుంచి స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జెవివి కార్యాలయంలో తరగతులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు మురళి గుప్త, కార్యదర్శి రవిశంకర్, శార్వాణి పాల్గొన్నారు

అతి తక్కువ ఫీజుతో..

జమ్మలమడుగు రూరల్ : దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న డిఎస్‌సి అభ్యర్థుల కోసం అతి తక్కువ ఫీజుతో జమ్మలమడుగులోనే టెట్, డిఎస్‌సి కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు కోచింగ్ నిర్వాహకులు ఎస్.సుబ్బరాజు యాదవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, నియోజకవర్గ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94940 79924 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బద్రిపల్లిలో అపరిశుభ్రత తొలగింపు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని బద్రిపల్లి గ్రామంలో శనివారం పారిశుధ్య పనులను చేపట్టారు. జిల్లావ్యాప్తంగా డయేరియా కేసులు నమోదు అవుతుండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన కంపచెట్లను తొలగించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త వీరనారాయణ యాదవ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అరుణ్ సాయి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గండి క్షేత్రానికి టివి వితరణ

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రం శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానానికి వేంపల్లె పట్టణానికి చెందిన (బిజిఎస్) ఎలక్ట్రానిక్స్ అధినేత వెంకట జయకుమార్, ఆయన భార్య బైరిశెట్టి జ్యోతికుమారి జ్ఞాపకార్థం వారి కుమారులు బాలగంగాధర్, వెంకట సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.40,000 విలువ చేసే 55ఇంచ్ గూగుల్ టీవీని బహుకరించారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. దాతలకు ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్మశానాలపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండలంలోని శ్మశానాల అభివృద్ధికి డిప్యూటీ తహశీల్దార జాన్సన్, పిఆర్ ఏఈ సమక్షంలో నాలుగు పంచాయతీల్లో శ్మశానాలు సర్వే చేసి హద్దులు చూపారు. తోట్లపల్లి, మల్లేపల్లి, ముడమాల, రేకులకుంట పంచాయతీల్లో ఇప్పటికే సర్వేలు పూర్తి చేశారు. సర్వే కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

23 నుంచి 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 23వ తేదీ నుంచి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి మండల వ్యవసాయ శాఖ అధికారి రామాంజనేయరెడ్డి కోరారు. సింహాద్రిపురం రైతు సేవా కేంద్రంలో శనివారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేయాలని సూచించారు. సాగు చేసిన పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి దోహదపడాలని కోరారు. రైతులను సేంద్రియ సాగు పట్ల అవగాహన కల్పించి, సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలో ఈనెల 23వ తేదీ నుంచి 27 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు శనివారం ఎంపిడిఒ జాషువ ఒక ప్రకటనలో తెలిపారు. 23న పి.వెంకటాపురం, 24, 25 తేదీల్లో చిన్న దండ్లూరు గ్రామంలో, 26, 27 తేదీల్లో ఇల్లూరు, 23 నుండి 27వరకు చిలంకూరు, పొట్లదుర్తి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరరు.

నాసిరకంగా నాడు-నేడు పనులు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు జడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడు పనుల విషయంలో విద్యార్థులు అసంతృప్తి చెందుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. పాఠశాలలో సరైన సౌకర్యాలు లేవన్నారు. ఆర్ఒ ప్లాంట్ లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పాఠశాలకు అవసరమైన వంట గదిని, ప్రహరీని ఏర్పాటు చేయాలని వారు కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్ పాల్గొన్నారు.


పశువుల సంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే 'పుట్టా'

స్వార్థం కోసమే సంతను మార్చారు

ప్రజాశక్తి మైదుకూరు

వైసిపి స్వార్థం కోసమే పశువుల సంతను నంద్యాల రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి గగ్గితిప్ప వద్దకు మార్చారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం పాతచోట నంద్యాల రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆయన పశువుల సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జరిగిన పురపాలక కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో మెజారిటీ కౌన్సిలర్లు గగ్గితిప్ప వద్ద ఉన్న పశువుల సంతను నంద్యాల రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. గత ప్రభుత్వం ట్రాఫిక్ సమస్యలు చెప్పి గగ్గితిప్ప వద్ద ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అక్కడ కనీస వసతులు కూడా లేవన్నారు. గగ్గితిప్ప వద్ద సమస్యలు ఉన్నాయని అక్కడ వ్యాపారం కూడా సరిగ్గా జరిగేది కాదని వ్యాపారులు చెప్పారన్నారు. గగ్గితిప్ప వద్ద స్థలాన్ని ఎవరు ఆక్రమించకుండా అక్కడ ప్రభుత్వ గోదాములు నిర్మాణం చేసి అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ యార్డులో కొన్ని వసతులు లేవని, వాటిని కూడా వచ్చే శనివారంలోపు సమకూరుస్తామన్నారు. ప్రజలకు అవినీతి లేని పరిపాలన అందించి, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సామాజిక కమ్యూనిటీ వైద్యశాలను శనివారం ఆయన సందర్శించారు. స్థానిక వైద్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉత్తమ వైద్యాన్ని అందించాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని విభాగాల వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. చిన్నారులకు, గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం వైద్యశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, వైద్యాధికారి డాక్టర్ కరీం, వైద్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శలు రాజకీయ లబ్ధి కోసమే

ప్రజాశక్తి - సింహాద్రిపురం


మాట్లాడుతున్న బిటెక్ రవి

ప్రశాంతంగా ఉన్న సింహాద్రిపురం మండలంలో వైసిపి నాయకులు రాజకీయ లబ్ధి కోసమే పరామర్శలు చేయడం మానుకోవాలని పులివెందుల నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. స్థానిక తన నివాసంలో శనివారం ఆయన ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి వీడియో విడుదల చేశారు. ఎంపీ వైస్ అవినాష్‌రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసమే శుక్రవారం సింహాద్రిపురానికి పరామర్శకు వచ్చారని వైసిపి నాయకులు హాజీవలి తదితర మైనార్టీ నాయకులు చెప్పారన్నారు. దాడి జరిగినట్లు పోలీస్‌స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే పరామర్శకు వచ్చినట్లు ఉందన్నారు. హత్య రాజకీయల గురించి మాట్లాడే అర్హత ఎంపీ అవినాష్ రెడ్డికి లేదన్నారు. వినుకొండలో రషీద్ హత్య పార్టీలకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. అది కేవలం వ్యక్తిగత కక్షలు తప్ప, అందులో రాజకీయ ప్రమేయం లేదన్నారు. గతంలో పులివెందుల సైతం మీ చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి కిరాతకంగా చంపారన్నారు. దీంతోపాటు సింహాద్రిపురం మండలం దుద్దికుంటలో పరమేశ్వరరెడ్డి హత్య కేసులో సైతం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తమ పలుకుబడి ఉపయోగించి కొంతమందిని తప్పించారన్నారు. ఈ కేసులన్నీ త్వరలోనే మళ్లీ విచారణ జరుగుతాయన్నారు. నిందితులు ఆ కేసుల్లో తప్పించుకోలేరని బిటెక్ రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ముళ్ల మహమ్మద్, హాజీవలి పాల్గొన్నారు.

చక్రాయపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

చక్రాయపేట : పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. శనివారం పులివెందుల పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వరస్వామి, వీరభద్ర స్వామి చైర్మన్ రామాంజనేయరెడ్డి దేవాలయం ముందు భాగానికి మురికి నీరు వస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బీటెక్ రవి కడప దేవాదాయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌కు ఫోన్ ద్వారా మాట్లాడారు. అలాగే పలు సమస్యలను బీటెక్ రవి దృష్టికితీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అన్ని విషయాలు వివరించి త్వరలో నిధులు చేస్తామని ఆయన నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి, చక్రాయిపేట వెంకటేశ్వర, వీరభద్ర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారమే టిడిపి లక్ష్యమని టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో బీటెక్ రవి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను ఆయన తెలుసుకొని అక్కడికక్కడే కొన్ని సమస్యలను అధికారులతో చరవాణిలో మాట్లాడి పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను త్వరలోనే అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింప జేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గండిలో జరిగిన అరాచకాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పుణ్యక్షేత్రమైన గండి దేవస్థానం పరిధిలో జరిగిన అరాచకాలపై అధికారులు విచారణ జరపాలని టిడిపి ఇడుపులపాయ యూనిట్ ఇన్‌ఛార్జి పోతిరెడ్డి శివ కోరారు. వేంపల్లె టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో గండిలో ఒక అధికారి చేసిన అన్యాయాలను, అక్రమాలను కూటమి ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తీసుకెళ్లి, ఆ అధికారిని బదిలీ చేయించారన్నారు. అరాచకాలపై పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి దేవాదాయ శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఎస్పిని కూడా కలిసి, విచారణ జరిపించాలని కోరతామని శివ తెలిపారు.

హత్యలపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

హత్యలపై మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారం కోల్పోయిన తర్వాత జగన్‌రెడ్డి తప్పులు ఒక్కొక్కటి బయట పడుతున్నట్లు చెప్పారు. తప్పులను కప్పి పుచ్చుకొనేందుకు టిడిపి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ జరుగుతున్న వ్యక్తిగత హత్యలను టిడిపి పార్టీకి ఆపాదించడం జగన్‌రెడ్డి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు గోటూరు నాగభూషణం, మైనార్టీ జిల్లా కార్యదర్శి ఫయాజ్, ఇలియాస్, మహబూబ్ షరీఫ్, డాక్టర్ కరిముల్లా, పిపి చెంద్రాయుడు, సయ్యద్ పీరా, యాసీన్, నారాయణ పాల్గొన్నారు.